# సి. ఉమాదేవి


రంగుల కల నిజమవుతున్నందుకు సువర్ణ మనసంతా సంతోషం పరుచుకోగా...

"అయితే సాయంత్రం మీ కోసం చూస్తూంటాను మరి", అంటూ వంటింట్లోకి వెళ్ళింది. అప్పటికే వుడికించివున్న బంగాళాదుంపలు చెక్కు తీసి, నూనెలో వేయించి పప్పులపొడి చల్లి కొత్తిమీరతో అలంకరించి టిఫిను బాక్సులో సర్ది, మరోసారి టిఫిను బాక్సు శుభ్రంగా తుడిచి ఆనంద్‌కందించింది. తండ్రి వెనకే కొడుకు, కూతురు కూర్చుని తల్లికి 'టాటా' చెప్పారు.

'తన సంసారంలోకి కోరుకున్నవి వస్తున్నాయి. తనకు, పిల్లలకూ ఉన్న టి.వి. కోరికను ప్రక్కకు పెట్టి భర్త స్కూటర్ కొనుక్కోవడానికే ప్రాముఖ్యమిచ్చింది. అటు పిల్లలకు స్కూలు బస్సు ఫీజులు, ఇటు భర్తకు ఆటో ఖర్చులు, పైగా బస్సు ఇక్కట్లు తప్పుతాయనుకుంది. స్కూటరు ఇన్‌స్టాల్‌మెంట్లు పూర్తయిపోతున్నాయి. పైగా మరో నెలలో ప్రమోషను వచ్చేటట్లుంది అన్నాడు ఆనంద్. అసిస్టెంటు మేనేజరు నుంచి మేనేజరవుతాడు. జీతంతోపాటు హోదా పెరుగుతుంది. వారూ వీరూ రావచ్చు. కనీసం టి.వి. అయినా లేదే మేనేజరింట్లో అనుకుంటారేమోనని తను వేసుకున్న ప్రణాళికను చెప్పి ఒప్పించగలిగింది.

థ్యాంక్ గాడ్! ఇంత త్వరగా వప్పుకుంటాడనుకోలేదు'... తృప్తిగా నిట్టూర్చింది సువర్ణ.

"ఇన్నాళ్లూ స్కూటర్ ఇన్‌స్టాల్మెంట్స్ కడ్తూ రిలాక్స్ కాలేకపోయాం. కొన్నాళ్లు సేదతీరుదాం" అని ఆనంద్ అన్నా", అప్పు తీర్చడానికి అలవాటు పడ్డాం అయినా మనమేం వేలు పోయక్కరలేదు పైగా టి.వి. కొంటే డి.వి.డి.



ఫ్రీ అట! ఈ కాలంలో మనం పిల్లలతో సినిమా కెళ్లాలంటే ఎంత లేదన్నా అన్నీ కలుపుకుంటే రెండువందలవుతుంది. ఇంట్లో డి.వి.డి ఉంటే ఇరవై రూపాయలకే సినిమా...

మనం వడ్డీ కూడా కట్టక్కరలేదట. జీరో పర్సెంట్ ఇంట్రెస్ట్ అని రాసారు పేపర్లో" అని చెప్పసాగింది.

అన్నీ క్షుణ్ణంగా చదివి ఒక నిర్ణయానికి వచ్చేసినట్టున్న భార్యను చిన్నబుచ్చలేక సరే అనేసాడు ఆనంద్.

'ఆఫీస్‌లో వర్క్‌లోడ్ ఎక్కువయితే తిండి కూడా మరిచిపోతారు... జ్ఞాపకం చేసింది. అంటే సువర్ణ సాయంత్రానికంతా తయారై ఉంటుందన్న మాట'. ఆనంద్ పెదవులపై చిన్న చిర్నవ్వు!

"నీలో నువ్వే నవ్వుకుంటే చాలదు... మాకూ చెప్పాలి" అంటూ వచ్చాడు స్కూటరుకు అప్పు ఇప్పిచ్చిన స్నేహితుడు.

"సరే ముందు కూర్చో సమయానికొచ్చావు". ఆపదలో ఆదుకునే దైవం ప్రత్యక్షమైనంత సంబరం తొంగి చూసింది ఆనంద్‌లో.

"ఏమిటి విశేషం? మేనేజర్ పోస్ట్ వచ్చేసిందా? నాకు తెలియకుండానే!"

"ఫైల్ జి.యం. దగ్గరుంది. ఆ సంగతలా వుంచుగానీ, నాకో చిన్న సాయం చేయగలవా?"

'ఏమిటన్నట్టు' చూసాడు స్నేహితుడు.

"మంచి కలర్ టి.వి.... అదేదో డి.వి.డి. కూడా ఫ్రీగా ఇస్తున్నారట! ఆ షాపేదో వెదకాలి. నువ్వు సహాయపడితే..."


"ఇంతేనా! దీనికి సహాయమక్కరలేదు సలహా చాలు. ఇంటికెళ్లి నింపాదిగా పేపర్ చూడు... షాపు అడ్రస్ ఫోను నంబరుతో సహా ఉంటుంది. ఓ ఫోన్‌కొట్టు. అన్నీ వివరంగా చెప్తారు. స్కూటర్‌కి పెట్రోలు ఆదా. మార్గం చెప్పాను. ఇంతకీ ఎలా ఉంది స్కూటరు? చివరి వాయిదా కట్టేసి రిజిస్ట్రేషన్ కాగితాలు, డూప్లికేట్ తాళం తెచ్చేసుకో. ఇంతకీ నేను వచ్చిన పనేంటంటే మా ఫ్రెండ్స్ నలభై ఎకరాలు కొన్నారు. మంచి రిసార్ట్స్. నెలకు వెయ్యిరూపాయలు కడితే మూడు వందల చదరపు గజాలు నీ స్వంతమవుతాయి. నాలుగేళ్లలో తీర్చవచ్చు. నీ వాయిదాలు తీరేసరికి నీవు కొన్నదానికి నాలుగింతలవుతుంది".

ఆశ్చర్యంతో ఆనంద్ కళ్లు విప్పారాయి.

"నిజమే కానీ... టి.వి. కొనాలి... అదీ ఇన్‌స్టాల్మెంట్‌లోనే..." నసిగాడు ఆనంద్.

"దానికీ దీనికీ లింకేమిటి? మంచి కార్నర్ ప్లాట్. సరిగ్గా నేను తీసుకున్న దాని వెనుకే. ఏదో ఇద్దరం కలిసి చిన్నవి రెండు గదులేసుకున్నామనుకో... విశ్రాంతిగా ఉండాలనుకున్నప్పుడు కుటుంబాలతో వెళ్లొచ్చు. అంతెందుకు? మీ అమ్మాయి పెళ్లికో, అబ్బాయి చదువుకో పెట్టుబడి అనుకో. వద్దనుకున్నప్పుడు లాభానికమ్ముకోవచ్చు".

"ఏమంటావ్? ఏమంటావులే, ఇదిగో అప్లికేషను. సంతకం పెట్టు. మిగతా పనులన్నీ నేను చూసుకుంటాను. రెండు ఫొటోలు కావాలి. అవీ తరువాత ఇవ్వచ్చులే" కాగితాలు ముందుకు జరిపాడు. ఇదివరకెంతో సహాయపడిన స్నేహితుడి దగ్గర మొహమాటం ఒకవైపు, చౌకబేరం పోగొట్టుకుంటున్నానేమో అనే బాధ మరోవైపు... ఛీ... మరీ వెయ్యిరూపాయిలకి వెనుకా ముందూ చూస్తున్నాననుకొంటాడేమో. అయినా స్నేహితుడు చెప్పింది బాగానే ఉంది. సైట్




కొన్నానంటే సువర్ణ కూడా సంతోషపడుతుంది. టి.వి. కావాలంటే పోస్ట్‌పోన్ చెయ్యొచ్చు...' అనుకుంటూ సంతకం చేసేసాడు.

"థాంక్యూ ఆనంద్. నీకు రైట్ డెసిషన్ మేకింగ్ ఉంది. సరే... ఈ నెల వాయిదా వెయ్యి రూపాయలు... నాలుగు నెలలకు నాలుగువేలు కట్టెయ్. అంటే నీవు మూడు నెలల ముందే చేరినట్టు లెక్క. అలా అయితేనే నీ అప్లికేషన్ నంబరు లాటరీలో వేస్తారు".

"లాటరీయా!" ఆసక్తిగా ముందుకు వంగాడు ఆనంద్.

"కస్టమర్ల నంబర్లన్నీ లాటరీ తీస్తారు. ప్రతి మూడునెలలకోసారి. నంబరు తగిలితే టి.వి. ఫ్రీ."

టి.వి వచ్చినంత సంబరపడిపోయి నాలుగు వేలకి చెక్కువ్రాసిచ్చాడు ఆనంద్.

చెక్కందుకుని సంతోషంగా వెళ్లిపోయాడు ఆనంద్ స్నేహితుడు.

+ + +

సాయంత్రం ఇంటికి చేరిన ఆనంద్‌కి కాఫీ తోపాటు అతనికిష్టమని చేసిన చెగోడీలు పళ్లెం నిండా తెచ్చిపెట్టింది సువర్ణ.

చెగోడీలు కరకరలాడిస్తూ "నేను భూమి కొన్నానోయ్!" వామనుడు భూమినంతా ఆక్రమించుకున్నట్లు – తాను భూమండలాన్నే కొనేసినంత ఊపులో ఉన్నట్లు కాళ్ళు ఊపడమే చెప్తోంది.

"భూమి కొనడమేమిటి!"

"ఇంకా అర్ధంకాలేదా? ఇంటి స్థలం కొన్నాను".

సువర్ణకు భూమి గుండ్రంగా తిరిగినట్లనిపించింది.

"సరేలే... జోకులాపండి. షాపుకెళ్దాం. మీ స్నేహితుడిందాక ఫోన్‌చేసి మంచి షాపు గురించి చెప్పారు. పిల్లలు కూడా ఇంటికి టి.వి. వస్తోందంటే సరదాపడి హోమ్‌వర్కంతా గబగబా చేసేసారు". తండ్రి రాకకై అంతవరకూ ఆశగా ఎదురు చూసిన పిల్లలను దగ్గరకు తీసు

కుంటూ అంది.

"ఔన్నాన్నా!" పిల్లలిద్దరూ తలలూపేసారు వేగంగా.

చెగోడీలు పటపటలాడించేసి కాఫీ నెమ్మదిగా త్రాగుతూనే 'స్థలం కోసం నాలుగు వాయిదాలు చెల్లించినట్టు, మూడు వందల గజాలు మన స్వంతమంటూ' చెప్పాడు - 'ఇక టి.వి. మాట అనదులే' అనుకుంటూ.

"మంచిపని చేసారండీ" అని భర్తను అభినందిస్తూనే "మరిక టి.వి. పోస్ట్‌పోనేనా?" పిల్లల ముఖాలవంక చూస్తూ బెంగగా అడిగింది సువర్ణ.

"ఛ! ఇన్ని రోజులూ పిల్లల చదువులు పాడవుతాయన్న వంకతో టి.వి.ని వాయిదా వేసేసాడు. భార్యను చూసి ప్రాణం ఊసూరుమంది. తనకు ఆఫీసుంది. సాయంత్రమయితే స్నేహితులతో కాసేపు కాలక్షేపం. పాపం ఇంట్లో బందీలా ఇంటి పని, పిల్లల చదువులూ... అన్నీ తానే. ఇక చిన్నబుచ్చకూడదనుకున్నాడు.

\+ + +

'ఖచ్చితంగా టి.వి. ఎనిమిదవ వింతే' అనుకున్నాడు ఆనంద్. షాపులోని వ్యక్తి అన్ని వివరాలూ మార్కెటింగ్ మెళకువలతో వల్లెవేస్తున్నాడు. అప్పయినా సరే... దర్జాగా కొనుక్కుంటున్నానన్న తృప్తితో వెలిగిపోతున్నాడు ఆనంద్. చివరికి డి.వి.డి. ఫ్రీ అన్నదానికే ఓటేసారందరూ. ఇరవై ఐదు శాతం కట్టితే చాలు... ఆపైన వాయిదాలే. ఎంత? నెలకి వెయ్యి. పన్నెండు నెలల్లో ఖతం! షాపతను లెక్కలు తేల్చాడు.

'అంటే ఇప్పుడు నాలుగు వేలు కట్టాలన్న మాట! బ్యాంకులో డబ్బులకు కాళ్లొచ్చాయి. నాలుగువేలు కట్టగానే టి.వి. వచ్చేస్తోందని ఆనంద్, డి.వి.డి. ఫ్రీ అని సువర్ణ, నాలుగు సి.డి. గేమ్స్ వచ్చాయి... ఇక స్కూల్లో అన్ని కార్టూన్ షోలూ తెలుసుననన్నట్లు మాట్లాడవచ్చని పిల్లలూ పొంగిపోయారు.

ఇంటికి వచ్చిన టి.వి.కి అందమైన కవర్ వేసి, టి.వి. మీద తమ కుటుంబమంతా కలిసి ఎగ్జిబిషన్‌లో ముచ్చటపడి తీయించుకున్న ఫోటోని అమర్చింది సువర్ణ. టి.వి. చూడాలని పిల్లలు త్వరగా హోమ్‌వర్క్ చేసెయ్యడంతో ఆమెకు కాస్త తీరిక దొరికినట్టయింది. టి.వి. లేకుండా ఇన్నాళ్లూ అసలెలా ఉన్నానా అని ఆశ్చర్యపోసాగింది. ఆనంద్‌కి పేపర్ చదివే లోపే వార్తలు తెలిసిపోతున్నాయి.

తనకి చక్కగా ఇద్దరు పిల్లలు. వాళ్ల భవిష్యత్తుకు ఉపయోగపడాలని తను స్థలం కొన్నాడు. టి.వి. లాంటివి కొనుక్కోగలుగుతున్నాడు... ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో వస్తువులు వచ్చేస్తూంటే సామాన్యుడి పరిస్థితీ భేషుగ్గానే ఉంది. ఎవరూ ఏదీ లేదనుకోనక్కరలేదు... అప్పిచ్చేవాడు ఎవడ్రెడీ!


\+ + +

మేనేజర్ పదవి రావడం ఆలస్యం... ఆనంద్ ఫ్రెండ్సంతా పార్టీ అని గోలపెట్టారు. కనీసం రెండు వేలయినా కావాలి. లోటు బడ్జెటే కానీ తప్పదు. టి.వి.కి పోను మరో రెండువేలు మిగిలున్నాయిలే అనుకుని ఇంట్లోనే స్నేహితులందరికీ చక్కటి భోజనాలు ఏర్పాటు చేసాడు. ఇంటిని, ఆమె వంటలనూ తెగమెచ్చుకున్నారందరూ. చక్కగా సర్దివుంచిన ఇంటినిచూసి మరీ ముచ్చటపడ్డారు.

"స్వంతమేనా?" ఆరా తీసిందో కుతూహలి.

"కాదండీ..." చెప్పలేక చెప్పింది సువర్ణ.

"ఇంత శ్రద్ధ చూపిస్తుంటేనూ..."




ఆమె మాటలకు సువర్ణ మౌనమే సమాధానమయింది.

ఆ రాత్రి ఆనంద్‌నడిగింది సువర్ణ – "మీ ఆఫీసులో అందరికీ స్వంత ఇండ్లేనా?"

"అందరికీ కాదు... కొందరు హోమ్‌లోన్ తీసుకుని అపార్ట్‌మెంట్లు కొనుక్కున్నారు". భార్య జవాబు చెప్పలేదు. ప్రక్కకు తిరిగి చూసాడు. కళ్లు మూసుకుని వుంది సువర్ణ. పాపం అలసిపోయింది పడుకోనీ అనుకున్నాడు. సువర్ణ మూసుకున్న కనురెప్పల వెనుక కన్నీళ్లు అదిమి ఉంచిన వైనం నిద్రలోకి ఒరిగిపోయిన ఆనంద్‌కి తెలియదు.

\+ + +

సువర్ణ మూగవేదనకు పరిష్కారంగా ఒకరోజు ఓ ఫోనందుకుంది. భర్త ఆఫీసునుంచి రావడం ఆలస్యం అవుతుందని తెలిసినా ఆరోజు మాత్రం ఆలస్యాన్ని భరించలేకపోతోంది.

"అమ్మా నాన్నింకా రాలేదా?" పిల్లల ప్రశ్నకు, "అబ్బ చదువుకోండిరా... ఆ పాడు టి.వి. ఆపేసి" అంటూ అరిచింది.

పిల్లలు టి.వి. ఆపేసి బుద్ధిగా కూర్చున్నారు పుస్తకాలందుకుని. ఆనంద్ వచ్చాడు అంతలోనే.

పిల్లలను పలకరించి, టి.వి. పెట్టి వార్తలు చూడసాగాడు. కాఫీ మాత్రమే తెచ్చిన భార్యను "ఏమున్నాయ్ మంచింగ్‌కి?" అని నవ్వుతూ అడిగాడు.

"మనం పొదుపు చేయాలండీ ఇక..." తప్పదన్నట్టుగా అంది సువర్ణ. తెల్లబోయాడు ఆనంద్.

"జీవితంలో మనం ఎదగాలీ అంటే కొన్ని కూర్చుకోవాలి, కొన్ని చేర్చుకోవాలి. ఔనా, కాదా? మీరే చెప్పండి" సువర్ణ చెప్పింది విన్నాక చిన్నప్పుడు చదివిన ఆర్థిక శాస్త్రం గుర్తుకొచ్చింది ఆనంద్‌కి. వాంట్స్ ఆర్ అన్‌లిమిటెడ్. ఒకటి

తీరితే మరొకటి... ఇప్పుడదే జరుగుతున్నట్లుగా ఉంది అనుకున్నాడు.

"స్కూటరు కూర్చుకున్నాం, టి.వి చేర్చు కున్నాం కదా" నవ్వాడు ఆనంద్

"ప్రొద్దుట సుబ్రమణ్యం గారు ఫోన్ చేసారు. ఎంత మార్దవంగా మాట్లాడారో తెలుసా!"

"సుబ్రమణ్యం... మార్దవం... అంటున్నావు మన అభిమాన గాయకుడు బాలుగారు కాదు కదా!"

"మీ జోక్ బాగుందికానీ ఈ సుబ్రమణ్యం గారు... అదేదో బ్యాంక్ పేరు చెప్పారు. పాపం సెల్ నంబరిచ్చారు".

"పాపమెందుకు?"

"అదే మిమ్మల్ని ఓ రింగివ్వమన్నాడు. తనే చేస్తాడట అప్పుడు".

"ఎందుకు?" ఆసక్తి పెరిగింది ఆనంద్‌లో.

"సార్ వయసు, ఉద్యోగం, సాలరీ చెప్తే హోమ్‌లోన్ ఇప్పిస్తాన్నాడు. వడ్డీ చాలా తక్కువట. పైగా ఇరవైయేండ్లు వాయిదాలు తీర్చుకోవచ్చుట! పర్సనల్ లోన్లు ఇస్తారట. నిజంగా ఎంత బాగా అప్పిస్తున్నారండీ... వెనుకటికి మా అమ్మా వాళ్లకాలంలో ఒక కారు కొనుక్కుని, ఇల్లు కట్టుకునేసరికి జుట్టు నెరిసి, పళ్లు వూడిపోయేవి".

తనను ఫోను ద్వారా గుర్తించి తన కొరకు వేచిచూడ్డం పెరిగిన తన స్టేటస్‌కి సింబల్‌గా కూడా ఉంది ఆనంద్‌కి.

'స్థలం కొన్నాం... ఇప్పుడు ఇల్లు కొనాలంటే అదీ లక్షలు పెట్టి... ఇరవైయేళ్లు వాయిదాలు కట్టూ'... అయినా ఈ బ్యాంకులు కుబేరావతారాలే అనుకున్నాడు. అయితే ముందు ముందు

> **ప్రక్కసీటు**
>
> మమ్మీ... ఇవాళ సిటీబస్‌లో వెళ్తాం డగా నా సీటుని 'నిలబడి ఉన్న ఒక ఆంటీకి ఇమ్మని డాడీ చెబితే వెంటనే లేచి ఇచ్చేసా' చెప్పింది చిట్టి.
>
> వెరీగుడ్... ఇవాళ ఒక మంచి పని చేసావన్నమాట. మరి తర్వాత నువ్వు నిలబడే ఉన్నావా?
>
> లేదు మమ్మీ... ఆ ప్రక్కసీటులోనే ఉన్న డాడీ ఒడిలో కూర్చున్నా...

గోవిందరాజస్వామిలా జీతం డబ్బులన్నీ వాయిదాలకే కొలిచికొలిచి అలసిపోతానని అనుకోలేదు.

కేవలం నెలతిరిగేలోపు ఋణం మంజూరు చేయించిన సుబ్రమణ్యం కమ్యూనికేషన్ స్కిల్స్‌ని ఆనంద్ తెగ మెచ్చుకున్నాడు. స్వంత ఇల్లు కల నిజమైనా వాయిదాలను తీర్చడానికి ఇల్లు అద్దెకివ్వకతప్పలేదు. జీతాలరోజు జీతాన్ని కాక వాయిదాలెన్ని కట్టాలో లెక్కలేసుకుంటున్నాడు ఆనంద్. అప్పిచ్చువాడు, వైద్యుడు... లేని ఊరిలో ఉండవద్దన్నాడు సుమతీశతక కారుడు ఇందుకా?

ఫోను మ్రోగింది. కార్ లోన్ మేళా... వివరాలు వినండి సార్.

వాయిదాల వూబిలో ఇరుక్కున్న ఆనంద్‌కి చమటలు పట్టాయి. వాయిదాలలో కొన్న ఏర్ కూలర్ కూడా వేడిగాలి ఇస్తున్నట్టనిపించింది. ఫోన్లు చేసి వెంటపడి మరీ అప్పులిస్తున్నారు. సారీ... అంటూ రిసీవర్ పెట్టేసాడు ఆనంద్ అప్పిచ్చువాడికి శతకోటి వందనాలు అనుకుంటూ... ●